విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 10 జనవరి 2025 8 పేజీలు

కుప్పడం చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

- క్షేత్రస్థాయి పరిశీలన చేసిన కేంద్రబృందం
- చీరాల వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని కోరిన కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ఒక జిల్లా-ఒక ఉత్పత్తి కింద ఎంపికైన చీరాల కుప్పడం చీరలకు జాతీయస్థాయిలో ప్రత్యేకత ఉందని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. ఒక జిల్లా - ఒక ఉత్పత్తి కింద చీరాల కుప్పడం చీరలు ఎంపికైన నేపథ్యంలో క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర బృందం సభ్యులు ఇష్ దీప్, డాక్టర్ దివ్యడింగ్రా గురువారం బాపట్ల జిల్లాకు చేరుకున్నారు. కేంద్ర బృందం సభ్యులను ఈ సందర్భంగా కలెక్టర్ జె.వెంకట మురళి మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు. చేనేత జౌళిశాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన కుప్పడం చీరల ప్రదర్శనను కేంద్ర బృందం సభ్యులు, కలెక్టర్ కలిసి పరిశీలించారు. అనంతరం పిపిటి ద్వారా చీరాలలో చేనేత వస్త్రాల ఉత్పత్తులు, అమ్మకాలు, చేనేత కార్మికుల జీవన స్థితిగతులపై చేనేత జౌళిశాఖ అధికారులు కేంద్ర బృందానికి నివేదిక అందజేశారు. దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో చీరాల పేరాల ఉద్యమ ప్రాశస్త్యాన్ని కేంద్ర బృందం సభ్యులకు అధికారులు

మిగతా 2 లో ...

మీసం మెలేస్తున్న రొయ్య

- ఆశాజనకంగా ఆక్వాసాగు
- ఒక్కసారిగా పెరిగిన ధరలు
- విదేశీ మార్కెట్ సానుకూలం
- మరోసారి ఆక్వాసాగుపై దృష్టి పెట్టిన రైతాంగం
- వనామి, టైగర్ రొయ్యకు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : రొయ్య మీసం మెలేస్తుంది. జిల్లాలో మరోసారి ఆక్వాసాగు ఆశాజనకంగా కనిపిస్తుంది. టైగర్, వనామి రొయ్యలకు డిమాండ్ పెరిగింది. ధరలు కూడా ఆశాజనకంగా ఉన్నాయి. విదేశీ మార్కెట్ సానుకూలంగా ఉండటంతో మరోసారి జిల్లాలో ఆక్వాసాగుపై రైతాంగం దృష్టి సారించారు. జిల్లాలోని నాగులుప్పలపాడు, కొత్తపట్నం, టంగుటూరు, శింగరాయకొండ, ఒంగోలు, ఉలవపాడు, మండలాల్లో ఆక్వాసాగు వేల ఎకరాల్లో చేపడతారు. గత నాలుగేళ్లుగా వైరస్ ప్రభావం, వాతావరణంలో సానుకూలమైన మార్పులు లేకపోవడంతో రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కొంతమంది రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారు. అయితే ఈ ఏడాది భూగర్భ జలాలు పెరగడం, వర్షపాతం ఎక్కువగా నమోదు కావడంతో పాటు విదేశాల్లో వనామి, టైగర్ రొయ్యకు డిమాండ్ పెరగడంతో రైతాంగం మరోసారి జిల్లాలో ఆక్వాసాగుపై దృష్టి సారించారు. దీంతో నిన్న మొన్నటి వరకు ఖాళీగా ఉన్న రొయ్యల చెరువులను రైతులు చదునుచేసి, నీరు నింపి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. అయితే వనామి, టైగర్ రొయ్యకు ప్రస్తుతం డిమాండ్ బాగా ఉందని తెలుస్తుంది. ఎక్కువ మంది రైతులు వీటిని సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో రొయ్య పిల్లలకు కూడా డిమాండ్ పెరగడంతో జిల్లా నుంచి రైతులు పాండిచ్చేరిపై దృష్టి పెట్టారు. అక్కడ వనామి, టైగర్ రొయ్య పిల్లలు ఎక్కువగా ఉత్పత్తి జరుగుతుంది. కొత్తపట్నం మండలంలోని రాజుపాలెం, ఈతముక్కలలో కొన్ని ఫ్యాక్చరీస్ ఉన్నప్పటికీ ఎక్కువ మంది రైతులు దూర ప్రాంతాల నుంచి రొయ్య పిల్లలను తీసుకొచ్చి సాగు చేసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలో ఈ దఫా ఆక్వాసాగుపై రైతులు పూర్తిగా దృష్టి పెట్టడంతో మరోపక్క లీజు రేట్లు కూడా బాగా పెరిగాయి. విదేశి మార్కెట్ గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది సానుకూలంగా ఉంది. 20 కౌంట్ రొయ్య ప్రస్తుతం 600 నుంచి 700 మధ్య ధర ఉంది. 100 కౌంట్ రొయ్య 175 నుంచి 225 వరకు పలుకుతుంది. దీంతో ఆక్వారంగం మరోసారి సిరుల వర్షం కురిపిస్తుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క వరుసగా పండుగలు రావడం రొయ్య వాడకం కూడా పెరగడం కూడా మార్కెట్‌లో డిమాండ్ పెరిగింది. మొత్తం మీద పరిశీలిస్తే జిల్లాలో ఆక్వాసాగు ఆశాజనకంగా ఉండటంతో రైతాంగం కూడా ఎక్కువ మంది ఈ సాగుపై దృష్టి సారించారు. మరోపక్క ప్రభుత్వం నుంచి సానుకూల ఆదరణ లభించడం, సబ్సిడీలు, బ్యాంకు రుణాలు వీటికి కూడా ప్రోత్సాహకాలు పెరగడంతో రైతులు ఆక్వాసాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

రెవెన్యూ సదస్సుల్లో అర్జీలను పరిష్కరించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : రెవెన్యూ సదస్సులలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. ఈ నెల 8వ తేదీతో రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో అన్ని మండలాల తహసీల్దార్లు, మండల సర్వేయర్లతో కలెక్టరేట్లో గురువారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణతో కలసి ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల నిర్వహణకు నేపథ్యాన్ని, రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యాన్ని వివరించారు. దీనికోసమే ఇటీవల కలెక్టర్లకు జోనల్ స్థాయి సమావేశాన్ని కూడా మంత్రి, రెవెన్యూశాఖ ప్రిన్సిపుల్ సెక్రటరీ, సీసీఎల్ఏ నిర్వహించడాన్ని ప్రస్తావించారు. ఈ దృష్ట్యా రెవెన్యూ సమస్యల సత్వర పరిష్కారంపై దృష్టి పెట్టాలని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయంలో మండల సర్వేయర్‌తో తహసీల్దారు ప్రత్యేకంగా చర్చించి రెవెన్యూ, రెవెన్యూయేతర సమస్యలకు సంబంధించిన అర్జీలను వేరుపరచాలని చెప్పారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలని ఆమె దిశానిర్దేశం చేశారు. ఆయా సమస్యల తీవ్రతనుబట్టి తహసీల్దార్లు క్షేత్ర స్థాయిలో పర్యటించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సర్వేశాఖ సహాయ పంచాకులు గౌస్ భాషా మాట్లాడుతూ సర్వేకు సంబంధించిన సందేహాలను, లోపాలను సరిచేయడానికి అవలంభించాల్సిన విధానాలను వివరించారు.

సర్వాంగ సుందరంగా సూర్యలంక బీచ్

కలెక్టర్ వెంకటమురళి

8లో

సుస్థిర జీవనోపాధుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

8లో

పేదలకు ఉచిత వైద్యం దూరం

● దుర్మార్గపు చర్యలు మానుకోవాలి

● అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్

విశాలాంధ్ర-మార్కాపురం : పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజల వైద్యం కోసం నిర్మిస్తున్న మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల పరిశీలనకు మార్కాపురం మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు మార్కాపురం మండలంలోని రాయవరం గ్రామం పరిధిలోని మెడికల్ కాలేజీ నిర్మాణం పనులను పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా అఖిలపక్ష పార్టీల కమిటీ కన్వీనర్ అందె నాసరయ్య మాట్లాడుతూ వెనుకబడ్డ పశ్చిమ ప్రకాశంలో కూటమి ప్రభుత్వం చర్యలు పేదలకు ఉచిత వైద్యాన్ని దూరం చేసే చర్యలు దూరం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. మెడికల్ కాలేజీ కాలేజీ సంబంధించిన మూడు బ్లాకుల భవనాలు, పురుషుల, మహిళల విద్యార్థుల వసతి భవనాలు 90శాతం పూర్తయ్యాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే పనులు ఆపడం జరిగిందని, పనులు ఆపకుండా కొనసాగించి ఉంటే 99 శాతం పనులు పూర్తయి అయి ఉండేవని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పిపిపి పేరు చెప్పి మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ఆపి పేదలకు వైద్య సహాయం అందకుండా ప్రైవేటు పరం చేసే దుర్మార్గపు చర్యలను ఉపసంహరించుకోవాలని ఆయన కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీని ప్రభుత్వమే వెంటనే పూర్తి చేయాలని, మెడికల్ కాలేజ్ డాక్టర్లు, సిబ్బంది బదిలీల ప్రక్రియ నిలిపివేయాలని, మెడికల్ కాలేజీ వైద్య సేవలను యధావిధిగా కొనసాగించాలని అన్నారు. మెడికల్ కాలేజీ డాక్టర్లు, ఇతర సిబ్బంది రావడంతో ఓపీలు పెరగటం జరిగిందని, దీంతో ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో రావడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వ అనాలోచిత చర్యల మూలంగా వైద్యశాలల్లో రోగులకు వైద్యం అందక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కాలేజీ నిర్మాణానికి వెంటనే నిధులు కేటాయించి, ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకొని, ప్రభుత్వమే నిర్మాణాన్ని పూర్తిచేసి ప్రభుత్వ నిర్వహణలోనే కాలేజీ నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని అడ్డుకొని ప్రైవేటీకరణ పేరు చెప్పి పేదలకు వైద్యాన్ని అందకుండా చేసే చర్యలకు సిద్ధపడితే అఖిలపక్ష పార్టీలు, ప్రజాసంఘాలు చూస్తూ ఉండబోవని ప్రజా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని నాసరయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మెడికల్ కాలేజీ పరిరక్షణ కమిటీ కో-కన్వీనర్, సిపిఎం పట్టణ కార్యదర్శి డీకేఎం రఫీ, ఎంపీజే రాష్ట్ర అధ్యక్షులు ఎస్.కె అబ్దుల్ రజాక్ సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి సోమయ్య, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు వి.సుదర్శన్, కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు పి.రిహానాభాను, వీసీకే పార్టీ డివిజన్ నాయకులు ఎన్ రాజు, సిపిఎం మండల కార్యదర్శి గుమ్మ బాలనాగయ్య, సిఐటియు నాయకులు పి రూబెన్, జె నాగరాజు, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు జవాజి రాజు, ఎంపీజే నాయకులు ఎస్.కె మీరావాలి పాల్గొన్నారు.

రైతన్నను నట్టేట ముంచిన ఉల్లికోడు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఖరీఫ్‌లో వరి సాగు చేసిన రైతన్నను ఉల్లి కోడు నట్టేట ముంచింది. దీంతో రబీ సైతం వరి సాగు చేసేందుకు రైతన్నలు వెనుకాడుతున్నారు. ఖరీఫ్ లో మండలంలో 14 వందల ఎకరాలలో వరిని సాగుచేశారు. అయితే ముమ్మరంగా పంట ఎదిగే సమయంలో ఉల్లికోడు తెగులు రైతన్నకు శాపంగా మారింది. గత ఖరీఫ్ సమయంలో మంచి దిగుబడులతో పాటు మంచి గిట్టుబాటు ధర ఉండడంతో ఆశతో వరిని సాగు చేశారు. అధిక వర్షాలతో వాతావరణ పరిస్థితులు తేడాలతో ఉల్లికోడు తెగులు తీవ్రంగా ఆశించింది. వ్యవసాయ అధికారులు సైతం పొలాలను సందర్శించి తగిన సూచనలు సలహాలు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయింది. దీంతో ఎకరాకు తెగులు లేకుండా బాగా పండితే 40 నుంచి 45 బస్తాలు దిగుబడి వస్తుంది. ఉల్లి కోడుతెగులు సోకిన పొలాలు 25 నుంచి 30 బస్తాల వరకు దిగుబడి వచ్చింది. కూలీల ఖర్చులకు సైతం రాకపోవడంపై రైతన్నలు వరిని కోసి పశువులకు మేతగా కోసి వేస్తున్నారు.

ముందస్తు సంక్రాంతి వేడుకలు

విశాలాంధ్ర-కంభం : కంభం పట్టణంలోని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా వినూత్న వేషధారణలతో ఆట పాటలాడి అలరించారు.ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు,ఎంఈవో బి. మాల్యాద్రి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ మన సంస్కృతిని ప్రతిబింబించే పండుగని, ధాన్యరాసులతో వర్ధిల్లే సిరుల పండుగ సంక్రాంతి అంటూ పండుగ విశేషాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల విద్యార్థులు రంగువల్లుల పోటీలలో పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మాల్యాద్రి, విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఎస్ఎంసి సభ్యులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైసీపీ క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వైసీపీ టెన్నిస్ బాల్, క్రికెట్ టోర్నమెంట్ పోస్టర్లను ప్రజాప్రతినిధులు యర్రగొండపాలెం లోని వైసీపీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ జనవరి 13న ప్రారంభం కానుంది. మొదటి బహుమతి విన్నర్స్ 50 వేల రూపాయలు, రెండవ బహుమతి రన్నరప్ కలదు, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సీరీస్ కలదు. మధ్యాహ్నం క్రికెట్ ఆడే ప్లేయర్స్‌కు మాత్రమే భోజన సౌకర్యం కలదు. ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం 2 గంటలలోపు ఎంట్రీ ఫీజ్ 500 రూపాయలు చెల్లించి టీమ్ పేరును నమోదు చేసుకోవాలని ఫోన్ నెంబర్లు 886422114, 9676531818 సంప్రదించాలన్నారు.

సంస్కృతి, సంప్రదాయాల పట్ల విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-చీమకుర్తి : సంక్రాంతి సంబరాల్లో భాగంగా రైస్ కృష్ణ సాయి గ్రూప్ ఇనిస్టిట్యూషన్స్ కార్యదర్శి శిద్దా హనుమంతరావు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయ పట్ల లోతైన అవగాహన కలిగిన విద్యార్థులు కావాలని అన్నారు. రైస్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు రెండు రోజుల నుంచి నిర్వహిస్తున్నట్లు రంగవల్లి పోటీలలో విజేతలను నిర్ణయించేందుకు అత్యధిక వచ్చిన శిద్దా సూర్య కుమారి విజేతలు నిర్ణయించి వారికి బహుమతులు అందజేశారు.విద్యార్థులు కబడ్డీ పోటీలు,టగ్గాఫ్ వార్ పోటీలు నిర్వహించి వారికి బహుమతులను చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవలిక కళాశాల ట్రెజరర్ శిద్దా భరత్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, గెలిచిన టీంకు కప్పును అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏ.వి.భాస్కరరావు, గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి. సుబ్రహ్మణ్యం, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జే.వి.రమేష్, రాగా కోఆర్డినేటర్ శ్రీమతి రేక, స్రవంతి, శాంతి, ఫిజికల్ డైరెక్టర్ హేమచంద్రబాబు, ఎం. సుబ్బారావు, సిహెచ్ విజయ సారధి మరియు అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ పాదాల చెంత అమిత్‌షాపై తీర్మానం

విశాలాంధ్ర-తాళ్లూరు : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేద్కర్‌ను, రాజ్యాంగాన్ని గౌరవించలేని ప్రభుత్వం పజాస్వామ్యానికి హానికరమని దర్శి నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయ కర్త కైపు వెంకట క్రిష్ణారెడ్డి అన్నారు. తాళ్లూరులో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద కేంద్ర హోం మంత్రి అమిషాపై చర్య తీసుకోవాలని కోరుతూ అంబేద్కర్ పాదాల చెంత తీర్మాన పత్రం అందించారు. తాళ్లూరు సర్పంచి మేకల చార్లెస్ సర్జన్ను కలిసి తీర్మానాన్ని మండల సర్వసభ్య సమావేశంలో కూడ ప్రస్తావించాలని కోరారు. సర్పంచితో కలిసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఎన్డీఏ పాలనపై ఆందోళన ఉధృతం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పొ లేసు, ప్రభుదాస్, నిరీక్షణ కుమార్, నరేష్, ప్రసాద్, ప్రతాప్‌రెడ్డి, జనార్ధన్, సెల్వం, ఐజాక్ బాబు, రాకేష్ తాళ్లూరు నాయకులు పాల్గొన్నారు.

కుప్పడం చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

వివరించారు. మినీ ముంబాయిగా ప్రాచుర్యం పొందిన చీరాల ఉత్పత్తి చేస్తున్న వస్త్రాలకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెంకట మురళి కోరారు. బ్రిటిష్ పరిపాలనను వ్యతిరేకిస్తూ ప్రారంభమైన స్వాతంత్ర ఉద్యమంలో చీరాల నుంచి స్వాతంత్ర సమరయోధులు పాల్గొన్నారని చెప్పారు. విదేశీ వస్త్రాలను వ్యతిరేకించాలని మహాత్మా గాంధీజీ ఇచ్చిన పిలుపు అందుకున్న చీరాల పేరాల చేనేత కార్మికులు ఉద్యమంలో ప్రధాన పాత్ర పోషించారని వివరించారు. నేత వస్త్రాల ఉత్పత్తులకు చీరాల క్షీరపురిగా మారిందన్నారు. 16,368 మంది చేనేత కార్మికులు మగ్గాలనే ఆధారం చేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. చేనేత సహకార సంఘాలలో 7,850 మంది చేనేత కార్మికులు సభ్యులుగా ఉన్నారని వివరించారు. ఒక జిల్లా ఒక ఉత్పత్తి కింద చీరాల కుప్పడం చీరలను ఎంపిక చేసి అధికారికంగా ప్రకటిస్తే చేనేత కార్మికులను మరింత ఆదుకున్నట్లు అవుతుందన్నారు. చేనేత కార్మికులకు కేంద్రం నుంచి రాయితీలు, బహుళ ప్రయోజనాలు కల్పించేలా సహకరించాలని కలెక్టర్ కోరారు.చేనేత కార్మికులను ఆదుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం సాధ్యమైనంతవరకు కృషి చేస్తుందని చేనేత జౌళిశాఖ సహాయ సంచాలకులు వనజ తెలిపారు. 50 సంవత్సరాలు దాటిన చేనేత కార్మికులకు సామాజిక భద్రత కల్పిస్తూ ప్రతినెల రూ.4వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ పంపిణీ చేస్తుందన్నారు. సహకార సంఘాలలో సభ్యులుగా ఉన్న చేనేతలందరికీ వివిధ రాయితీలు కల్పిస్తుందన్నారు. కుటుంబం మొత్తం నిరంతరం కష్టపడి పనిచేసినా వారికి చాలినంత కూలీ రావడంలేదని వివరించారు. కుప్పడం చీర తయారీకి ముగ్గురు వ్యక్తులు కలిసి పని చేయాల్సిందేనని, మూడు రోజులు కష్టపడినా కనీస కూలి డబ్బులు రావడంలేదని బృందానికి అధికారులు వివరించారు.

ఈ కార్యక్రమంలో చేనేత జౌళిశాఖ సంయుక్త సంచాలకులు కె.కన్నబాబు, జిల్లా సహాయ సంచాలకులు కె.నాగమల్లేశ్వరరావు, డీఓలు వెంకటేశ్వర్లు, చేనేతలు పాల్గొన్నారు.

నేడు మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన

ఏర్పాట్లను పరిశీలించిన గూడూరి ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-పెద్ద దోర్నాల : మండలంలోని వై.చర్లోపల్లె మల్లికార్జున పురం వద్ద చెంచు గిరిజనులతో సమస్యలు తెలుసుకునేందుకు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పర్యటన సందర్భంగా గురువారం మండలంలోని మోట్ల మల్లికార్జునపురం వద్ద ఏర్పాట్లను ఎర్రగొండపాలెం టిడిపి ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, టిడిపి నాయకులు ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దోర్నాల మండలంలో అత్యంత వెనుకబడిన ప్రాంతమైన దోర్నాల మండలంలో గిరిజన గూడాలలో విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో, కూటమి ప్రభుత్వ వచ్చినాక గిరిజన ప్రాంత గూడాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారని తెలిపారు. ఎర్రగొండపాలెం నియోజకవర్గంలోని గూడెలపై ప్రత్యేక శ్రద్ధ చూపినట్లు తెలిపారు. 13 గుడాలకు విద్యుత్ సౌకర్యం కల్పించినట్లు తెలియజేశారు. అతనే స్వయంగా చెంచు గూడాలను ప్రత్యేకంగా చూడాలని ఉద్దేశంతో రేపు పర్యటిస్తున్నారని కనుక ఈ కార్యక్రమంను జయప్రదం చేయాలని ఆయన కోరారు. మోట్ల మల్లికార్జునపురం వద్ద గిరిజన గూడెల్లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ మౌలిక వసతులను పర్యవేక్షించనున్న మంత్రి అనంతరం గిరిజనులతో మాటామంతి చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దోర్నాల మండల కన్వీనర్ ఏరువా మల్లికార్జునరెడ్డి, షేక్ మాబు, బట్టు సుధాకర్ రెడ్డి, బట్టు రమణారెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, వల్లపునేని కాశయ్య, దొడ్డ శేషాద్రి, చంటి, వెంకటేశ్వర్లు, గుంటక సుబ్బరాయుడు, పి కాశయ్య, వై.చెంచయ్య, కడిమెట్ల శ్రీనివాస యాదవ్, షేక్ బాషా, షేక్ ఇస్మాయిల్,తోట పవన్, ఇరకసాని దేవయ్య యాదవ్, షేక్ మంజూరు భాష, షేక్ సమద్, జనసేన పార్టీ మండల కన్వీనర్ కేతు మురళి, విద్యుత్ శాఖ అధికారులు, ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఉపాధి ఏపీవో వినయ్ పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ యూనిట్లకు దరఖాస్తులు

విశాలాంధ్ర-చీమకుర్తి : 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ ద్వారా స్వయం ఉపాధి యూనిట్లకు మంజూరు నిమిత్తం నిరుద్యోగుల నుంచి జనవరి 8 నుండి 16వ తేదీ వరకు గ్రామ వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకోవాలని చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై.రామకృష్ణయ్య తెలిపారు. మొత్తం 52 రకాల స్వయం ఉపాధి యూనిట్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు సచివాలయాల్లో ఓ.బి. ఎం.ఎస్. హెూటల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. గొర్రెల పెంపకం, మినీ డైరీ, మోడరన్ పవర్ లాండ్రీ, ఆటో, టాటా ఏస్,సెల్ఫోన్ రిపేరీ, వంటి 50 రకాల స్వయం ఉపాధి అయినట్లు ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. చీమకుర్తి పట్టణానికి సంబంధించి బీసీలకు 20 యూనిట్లు డబ్ల్యూ. ఎస్.లకు 7 యూనిట్లు మంజూరయ్యాయని వాటి వివరాలు సచివాలయం నందు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

విద్యార్థులకు బహుమతులు ప్రదానం

విశాలాంధ్ర-ఒంగోలు : అఖలభారత యువజనసమాఖ్య కరవది గ్రామ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ విద్యార్థిని విద్యార్డులకు వ్యాస రచన 'క్విజ్ పోటీలలో గెలుపొందిన వివేకనంద విద్యావిహార్ కరవది స్కూల్ విజేతలకు సి.పి.ఐ. సీనియర్ నాయకులు పీ శీతారామయ్య 'రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వి హనుమారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. సీపీఐ ఒంగోలు మండల కార్యదర్శి గద్దల రవి స్కూల్ కార్యనిర్వాహులు భరద్వాజ్ సాయి వివేక్ మరియు 'సిబ్బందికి, యాజమాన్యానికి పోటీలలో పాల్గొన్న విద్యార్థులకు యువజన సమాఖ్య అధ్యక్ష - కార్యదర్శి మొలతోటి హను మంతరావు పి.వి.సురేష్ అభినందనాలు తెలియజేశారు.

తిరుపతిలో తొక్కిసలాట దురదృష్టకరం

విశాలాంధ్ర-గిద్దలూరు : వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద తొక్కిసలాటలు చోటు చేసుకున్న ఘటనలో ఆరుగురు మృతి చెందారని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమని మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియ చేస్తున్నానని బీజేపీ పట్టణాధ్యక్షులు అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఒక క్రటనలో తెలిపారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యారోగ్య శాఖకు సూచిస్తున్నానపి మృతులు, క్షతగాత్రుల్లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చేవారు ఉన్నారని తెలిసింది. వారి కుటుంబీకులకు తగిన సమాచారం ఇవ్వడం, సహాయ సహకారాలు అందించడం కోసం సత్వరమే తగిన ఏర్పాట్లు చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులకు సూచిస్తున్నాను. మృతుల కుటుంబాల దగ్గరకు వెళ్ళి పరామర్శించి మనో ధైర్యం ఇచ్చే బాధ్యతలు టీటీడీ పాలక మండలి తీసుకోవాలని అప్పిశెట్టి ఒక ప్రకటనలో కోరారు.

నూరు శాతం ఉత్తీర్ణతకు కృషి చేయాలి

విశాలాంధ్ర-ముండ్లమూరు : పదో తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారులు జే సుబ్బారావు(1) కే వెంకటేశ్వర్లు(2) అన్నారు. మండల కేంద్రంలో గల ఆదర్శ పాఠశా లను గురువారం వారు సందర్శించారు. వారు మాట్లాడుతూ గత సంవత్సరం 10 పరీక్షలలో మండల స్థాయిలో మంచి మార్కులు సాధించారని, మార్చిలో జరగబోయే 10. ఇంటర్మీడియట్ పరీక్షలలో జిల్లాస్థాయిలో మంచి మార్కులు సాధించి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు పాఠశాలకు ముందు ఒక గంట సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత మరో గంట ప్రత్యేక తరగతులు నిర్వహించి మంచి మార్కులు సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. పాఠ్యాంశాలలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి తీర్చిదిద్దాలన్నారు. ప్రభుత్వం ఇటీవల ఇంటర్మీడియట్ విద్యార్థులు కూడా మధ్యాహ్న భోజనం పథకం ప్రవేశ పెట్టారని అవి అమలు చేస్తున్నారు లేదా అని తనిఖీ చేసి, భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో తరగతి గదులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ కే పూర్ణచంద్రరావు, ఉపాధ్యాయులు శ్రీవిద్య, సుజాత. తదితరులు పాల్గొన్నారు.

రైతు వారి పట్టా భూములుగా నమోదు చేయాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : పుల్లలచెరువు మండలం చౌటపల్లి రెవిన్యూ గ్రామంలో గల భూములను ఇనాం భూములుగా రికార్డులలో తప్పుగా నమోదు చేశారని చౌటుపల్లి రైతులు ఈరోజు గ్రామ సచివాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ భూములు 1952కు ముందు ఇనాముగా ఉండేవని వాటిని అప్పటి అధికారులు విచారణ చేసి ఇనాం తొలగించి 1972లో రైతు వారి పట్టా భూములుగా రికార్డులో చేర్చి రైతులకు పట్టాలు, పట్టాదారు పాసుబుక్కులు ఇవ్వడం జరిగింది అయితే దీనికి సంబంధించి ఇటీవల జరిగిన భూమి రీ సర్వేలో భాగంగా రెవెన్యూ అధికారులు మరలా ఇనాం అని తప్పుగా నమోదు చేయడం జరిగింది. సంబంధిత అధికారులు ఈ సమస్యను గుర్తించి ఇనాం అనే పదమును రికార్డులలో నుండి తొలగించి రైతు వారి పట్టా భూములుగా నమోదు చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేయుచున్నారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ఆది ఆంధ్ర ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాఠశాల ప్రధానో పాధ్యాయుడు గాయం కాశిరెడ్డి, ఉపాధ్యాయులు డాక్టర్ ఎస్‌కే జి.మస్తాన్ రహీంల ఆధ్వర్యంలో విద్యార్థులు ముందస్తు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులచే హరిదాసు కీర్తనలు, తిరుప్పావై పారాయణం, బాలికలు వేసిన అందమైన రంగవల్లులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు భోగి పండ్లు కోశారు. విద్యార్థులచే భోగిమంటలు వేయించి చలికాసుకున్నారు. ఈ ముందస్తు సంక్రాంతి సంబరాలను విద్యార్థులు తల్లిదండ్రులు గ్రామ పెద్దలు గ్రామస్తులు తిలకించారు.

షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ప్రారంభం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : సంక్రాంతి పండుగ పర్వదినం పురస్కరించుకొని ఈనెల 12వ తేదీన సంతనూతలపాడు బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆద్వర్యంలో మండల స్థాయి డబుల్ షటిల్ బ్యాట్మింటన్ టోర్నమెంటు స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని ఇండోరియల్ స్టేడియం నందు ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్లో పాల్గొనదలిచినవారు 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటల లోపు ఏంట్రీ ఫీజు 300 రూపాయలు చెల్లించాలని తెలిపారు. ఈ టోర్నమెంట్ విజేతలకు ప్రథమ బహుమతి రూ.7116/లు ద్వితీయ బహుమతి రూ.5116/లు తృతీయ బహుమతి రూ.3 116/లు ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. ఇతర వివరములకు ఎం రామాంజనేయులు 8885533149, 8142223589, 9573736463లను సంప్రదించాలని వారు తెలిపారు.

గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారంప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద వైద్యాధికారులు డాక్టర్ ఎస్పీ బాలయ్య డాక్టర్ సురేఖలుగర్భవతులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి మందులు టానిక్కులు ఇచ్చారు. అవసరమైన వారికి ఉచితంగాస్కానింగ్ పరీక్షలు నిమిత్తం సిఫార్సు చేశారు. స్టాఫ్ నర్సులు ఆశా కార్యకర్తలు గర్భవతులు పాల్గొన్నారు.

ధనరాజ్ కుటుంబానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర-కొమరోలు : గిద్దలూరు మండలం కొమ్మునూరు గ్రామంలో సచివాలయం జెఏసి తరపున అంబవరం గ్రామానికి చెందిన యువకుడు జీడిమెట్ల ధనరాజ్ విద్యుత్ స్తంభాలపై కరెంటు బల్బులు మారుస్తుండగా కరెంట్ షాక్ తగిలి గాయాల య్యాయి. వైద్యులు పరీక్షలు నిర్వహించి రెండు చేతులు తీసేయాలని 15 లక్షల వరకు ఖర్చవుతుందని బాధిత కుటుంబ సభ్యులకు తెలియజేశారు. విద్యుత్ ఘాతానికి గురి అయినటువంటి ధనరాజ్ తల్లిదండ్రులు దిక్కు తోచని పరిస్థితుల్లో సోషల్ మీడియా పరంగా రెండు చేతులు జోడించి మా బిడ్డకు ఆర్థికంగా సహాయం చేసి ప్రాణాలను కాపాడండి అని సోషల్ మీడియా పరంగా ప్రతి ఒక్కరిని పేరుపేరునా వేడుకుంటున్నారు. ఈ విషయాన్ని అమ్మ ఫౌండేషన్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ బోనేని వెంకటేశ్వర్లు యాదవ్ గ్రహించి మానవతా సేవా దృక్పథంతో అమ్మ ఫౌండేషన్ టీం సభ్యుల సహకారంతో పదివేల రూపాయలు నగదును బాధితుని గ్రామానికి వెళ్లి గ్రామంలో ఉన్నటువంటి పెద్దల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకి పదివేల రూపాయలు నగదును అందజేశారు. అమ్మ ఫౌండేషన్ సెక్రటరీ పంధన బోయిన భూపాల్ సలహాదారులు బోనేని రవికుమార్ యాదవ్ సభ్యులు బొమ్మని రవి, బొమ్మని శ్రీకాంత్, రాచకొండ రాము, పెద్ద శ్రీరాములు, నారాయణ పాల్గొన్నారు.

చర్మ డప్పు కళాకారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అంబటి సుబ్బారావు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మార్కాపురం నియోజకవర్గ నవ్యాంధ్ర మాదిగ చర్మకారుల డప్పు కళాకారుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులుగా మండలంలోని పెదారికట్ల గ్రామానికి చెందిన అంబటి సుబ్బారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నియామక పత్రాన్ని నవ్యాంధ్ర చర్మ డప్పు కళాకారుల పోరాటసమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కల్వకుంట్ల గోవింద ప్రసాద్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందజేశారు. సుబ్బారావు మాట్లాడుతూ నియోజకవర్గంలో చర్మ డప్పు కళాకారులు సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ పదవి నాకు వచ్చేందుకు కృషి చేసిన గోవింద ప్రసాద్‌కు సుబ్బారావు కృతజ్ఞతలు తెలిపారు. పలనాడు జిల్లా నాయకులు దేవయ్య పాల్గొన్నారు.

గోపిరెడ్డి మహాలక్ష్మి చిత్రపటానికి నివాళులు

విశాలాంధ్ర-సంతనూతలపాడు : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ మాజీ అధ్యక్షులు గోపిరెడ్డి ఓబులరెడ్డి సతీమణి గోపిరెడ్డి మహాలక్ష్మి దశ దిన కర్మ గురువారం ఒంగోలులోని తన నివాసం వద్ద జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరై ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి దుంపా రమణమ్మ వైసీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి మండల అప్పారావు మాజీ ఏఎంసిమార్కెట్ కమిటీ చైర్మన్ మాల బంగారు బాబు, ఐ.పిచ్చిరెడ్డి పాల్గొన్నారు.

మహాలక్ష్మి కుటుంబ సభ్యులకు సంతాపం

విశాలాంధ్ర-చీమకుర్తి : వైసీపీ సేవాదళ్ మాజీ అధ్యక్షులు, చీమకుర్తి సొసైటీ మాజీ అధ్యక్షులు గోపిరెడ్డి ఓబుల్ రెడ్డి సతీమణి గోపిరెడ్డి మహాలక్ష్మి దశదినకర్మ గురువారం నిర్వహించారు. స్వగ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశం జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, సంతనూతలపాడు నియోజకవర్గ వైసీపీ నాయకులు దుంపా చెంచిరెడ్డి, బండ్లమూడి మాజీ సర్పంచ్ యన్నం శేషిరెడ్డి మహాలక్ష్మికి చిత్రపటానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేశారు.

అమిత్‌షా రాజీనామా చేయాలి

విశాలాంధ్ర-చీమకుర్తి : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌పై కేంద్రమంత్రి అమీషా పార్లమెంట్లో చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ చీమకుర్తి మున్సిపల్ కమిషనర్ వై రామకృష్ణయ్యకి గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో తీర్మానంచేసి అమిత్ షాని తక్షణం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాశం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు షేక్ సైదా, సంతనూతలపాడు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త పాలపర్తి విజేష్ రాజు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తుమ్మల సుబ్బారావు, స్వర్ణ కృష్ణయ్య, వేల్పుల వెంకటేశ్వర్లు, దుంపా యలమందరెడ్డి, చిరంజీవి, శివశంకర్, అజయ్, కాలేశా, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను నేటి తరాలకు గుర్తుచేయాలి

ఏబీసీ హైస్కూల్లో ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర-తాళ్లూరు : సంస్కృతి సంప్రదాయాలను నేటి తరాలకు గుర్తు చేస్తూ ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించటం అభినందనీయమని జిల్లా క్షయ, లెప్రసీ అధికారి సురేష్ బాబు అన్నారు. తాళ్లూరులో ఎబీసీ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎబీసీ హైస్కూల్ వారు నిర్వహించిన సంబరాలు నేటి తరాలకు నాటి సంప్రదాయాలను గుర్తు చేసే విధంగా ఉన్నాయని అన్నారు. తన చిన్న తనంలో మరింత శోభగా సంక్రాంతి నిర్వహించుకునే వారని చెప్పారు. కర స్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ... సంక్రాంతి సంబరాలను ఎంతో కళాత్మకంగా, సాంప్రదాయ బద్ధంగా నిర్వహించటం అభినంద నీయని విద్యార్థులు చక్కగా నృత్యాన్ని ప్రదర్శిం చారని, ప్రోత్సహించిన ఉపాధ్యాయులకు అభి నందనలు చెప్పారు. ఎబీసీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలను విద్యార్థులకు గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. డైరెక్టర్ కాలేషా బాబు మాట్లాడుతూ... విద్యార్థులకు విద్యతో పాటు సంస్కృతి సంప్రదాయాలను గురించి తెలుపుతూ సంస్కృతికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. మండల వైద్యాధికారి షేక్ బాదర్ మస్తాన్ బి, కో ఆప్షన్ మెంబర్ కరిముల్లా రిటైర్డ్ ఉద్యోగుల సంఘ నాయకులు ఐ వెంకట రెడ్డి ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ముందుగా నిర్వహించిన ముగ్గుల పోటీలలో విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు.

బీకే విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో..

విశాలాంధ్ర-సీఎస్‌పురం : స్థానిక బీకే విద్యామందిర్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా ముందుగా విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించడం జరిగినది. ఈ పోటీలో విజేతలకు బహుమతులు అందజేయడం జరిగినది. ఆ తర్వాత భోగిమంటలు, హరిదాసుల వేసాధారణలలో సంక్రాంతి సంబరాలు ఏంతో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రత్నం విద్యాసంస్థల సెక్రటరీ మరియు కరస్పాండెంట్ మద్దుల శ్రీనివాసులు మాట్లాడుతూ మకర సంక్రాంతి అనేది మార్పు మరియు కొత్త ప్రారంభాల ఆగమనాన్ని, సూచిస్తుందని వెచ్చదనం మరియు ఉత్సాహంతో జరుపుకునే పండగని వివరించారు. ఇది చంద్రమానానికి బదులుగా సౌర క్యాలెండరు ఆధారంగా మాత్రమే జరుపుకునే హిందూ పండగని వివరించారు. ఇది ప్రతి సంవత్సరం జనవరి 14,15వ తేదీలలో వస్తుందని పిల్లలకి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యామందిర్ హై స్కూల్ హెచ్‌ఎం డి.సూర్య పాల్గొన్నారు.

'అనుమోలు'కు గౌరవం దక్కేనా?

- **కష్ట కాలంలో కార్యకర్తలను వెన్నంటి ఉండే నాయకుడు**
- **అధికారంలో లేనప్పుడూ అదే నాయకత్వ ధోరణి**

విశాలాంధ్ర-పొన్నలూరు : మండలంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడిగా పేరొందిన అనుమోలు సాంబశివరావుకు నామినేటెడ్ పదవులలో ఎటువంటి పదవి వరించనుంది. ఎటువంటి గౌరవం దక్కనుంది అనే ప్రచారం ఇరు పార్టీలలో జోరుగా సాగుతుంది. ఈ నేపథ్యంలో ఆయన గురించి ప్రత్యేకంగా తెలుసుకోవలసిన అంశాలు కొత్తగా ఏమి లేకపోయిననప్పటికి మండలంలో స్థానికంగా ఉండి కార్యకర్తలకు భరోసా కల్పించి 2019 ఎన్నికలలో క్రియా శీలక పాత్ర పోషించిన నాయకుడిగా అధిష్టానం వద్ద ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలుగుదేశం పార్టీలో చేరక ముందు కాంగ్రెస్ పార్టీలో ను, ఆ తరువాత వైసీపీ పార్టీలో కూడా నియోజకవర్గంలో ఒక ప్రత్యేక గుర్తింపు ఉన్న నాయకుడిగా పేరుంది. ఏ పార్టీ వారైనా సమస్య ఉంది అంటే ఆ సమస్య పరిష్కారానికి తన వంతు కృషి చేయడంలో ముందుంటారు. చిన్న, పెద్ద తేడా లేకుండా మండలంలో పార్టీలకు అతీతంగా ఆయనకు ప్రత్యేక స్థానం, అభిమానం సంపాదించుకున్నారు. పాత తరం రాజకీయ లక్షణాలు వంట పట్టించుకున్న ఆయన వారి అనుచరులకు సమస్యలు ఎదురైతే ఎంత దూరం అయినా వెళ్లే మనస్తత్వం ఉన్న నాయకుడిగా మంచి పేరుంది. ఒకవైపు వ్యవసాయంలో నష్టాలతో ఆర్థికంగా నష్టపోతున్నప్పటికీ పార్టీ కార్యక్రమాలను నిర్వహించడంలో వెనుకాడరని ఆయన అభిమానులు చర్చించుకుంటున్నారు. నామినేటెడ్ పదవుల ఎంపికలో ఆయనకు సరైన పదవి ఇచ్చి గుర్తింపు ఇవ్వాలని వారి అనుయాయులు కోరుతున్నారు. మండలంలో సాగుతున్న నామినేటెడ్ పదవుల సందడి నేపథ్యంలో ఆయన అనుచరులు ఆయన వద్ద ప్రస్థావించగా అధిష్టానం చూసుకుంటుంది, సరైన సమయంలో తగిన గుర్తింపు వస్తుందిలే అన్నట్లు ఆయన అనుచరులు అనుకుంటున్నారు.మరి చూడాలి అధిష్టానం సీనియర్ నాయకుడికి ఎటువంటి పదవి ఇచ్చి గౌరవిస్తుందో వేచి చూడాల్సిందే మరి.

సంక్రాంతి సంబరాలను విజయవంతం చేయాలి

విశాలాంధ్ర-పుల్లలచెరువు : మండలకేంద్రమైన పుల్లలచెరువు గ్రామంలో ఈ నెల 13,14,15 తేదీలలో జరిగే సంక్రాంతి సంబరాలు జయప్రదం చేయాలని పిఎల్ ఎన్ సి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పోట్లపల్లి.బాలకృష్ణ అన్నారు. పోట్లపల్లి బాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్థుల సహకారంతో గత మూడు సంవత్సరాలుగా సంక్రాంతి సంబరాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. 13వతేదీ భోగి పండుగ నాడు ఉదయం 10 గంటలకు గోమాత అందాల పోటీలు(ప్రత్యేకంగా అలంకరణ). మొదటి బహుమతి 5116రూపాయలు, రెండవ బహుమతి 2116 రూపాయలు. సంప్రదించవలసిన నెంబర్ ఆర్మీ బుజ్జి 9391026643, మధ్యాహ్నం 3గంటలకు ముగ్గుల పోటీలు,(పుల్లల చెరువు గ్రామ మహిళలకు మాత్రమే).మొదటి బహుమతి వెండి గిన్నె, రెండవ బహుమతి 2116 రూపాయలు, సంప్రదించవలసిన నెంబరు.జి.వి.గురునాథం 6302054143.రాత్రి 8 గంటలకు కోలాటం ప్రదర్శన. 14వ తేదీన ఉదయం 10 గంటలకు మండలస్థాయి ట్రాక్టర్ రివర్స్ పోటీలు. పోటీలలో పాల్గొనువారు ట్రాక్టర్ ను వారే తీసుకొని రావాలి.మొదటి బహుమతి 5116,రెండవ బహుమతి 3116 రూపాయలు. సంప్రదించవలసిన నెంబరు.9347958293, సాయంత్రం 4 గంటలకు స్లో బైక్ రేస్ఎవరి బైకు ను వారే తీసుకొని రావలెను.మొదటి బహుమతి 3116, ద్వితీయ బహుమతి 2116 రూపాయలు. సంప్రదించవలసిన నెంబరు 8712321888, రాత్రి 7 గంటలకు పాట కచేరి, 15వ తేదీ కనుమ పండుగ నాడు సాయంత్రం 5 గంటలకు మండలస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు.మొదటి బహుమతి 5116, ద్వితీయ బహుమతి 3116 రూపాయలు, సంప్రదించవలసిన నెంబరు 81 79392911,7780727299. గ్రామంలోని ప్రతి ఒక్కరు పాల్గొని కార్య క్రమాలను జయప్రదం చేయాలని పిఎల్ ఎన్ సి ఫౌండేషన్ వ్యవస్థాపకులు పోట్లపల్లి. బాల కృష్ణ తెలిపారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - మార్టూరు : సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మార్టూరులోని పలు పాఠశాలలలో మండలంలోని బొబ్బేపల్లి హై స్కూల్‌లో గురువారం ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.బొబ్బేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమతి ప్రధానం చేశారు.విద్యార్థులకు గాలిపటాల పోటీలు నిర్వహించారు.మార్టూరు రాయల్ స్కూల్ ఆవరణలో మహిళా ఉపాధ్యాయులు భోగి పళ్ళు,భోగి మంటలతో అందమైన రంగవల్లు తీర్చిదిద్ది ముందస్తు సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు పలు రకాల ఆటోల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

విశాలాంధ్ర - యద్దనపూడి : విద్యార్థులు విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని మండల విద్యాశాఖ అధికారి సిహెచ్ గోపి అన్నారు.యద్దనపూడి ముద్దన హనుమయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న షేక్ నజ్మా ఆచార్య నాగార్జున యునవర్సిటీలో జరిగిన మార్షల్ ఆర్ట్సలో రాణించి స్టేట్ జూడో టోర్నమెంట్‌లో సబ్ జూనియర్స్ విభాగంలో తృతీయ బహుమతి రజత పతకం సాధించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో మరిన్ని పోటీల్లో పాల్గొని మరింతగా రాణించి మంచి బహుమతి పొందాలని ఆకాంక్షించి విద్యార్థిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.దేవేంద్రరావు,రావి శ్రీనివాసరావు, పిడి,ఉపాధ్యాయులు తదితరులు అభినందించారు.

ఉత్తర బైపాస్‌లో వ్యర్థాలు నిల్వలు

విశాలాంధ్ర - కొరిశపాడు : మేదరమెట్ల ఉత్తర బైపాస్ పైలాన్ దగ్గర గ్రామంలోని వ్యాపారస్తులు కొబ్బరి బొండాలను కోడి వ్యర్థాలను ప్రజల రద్దీగా తిరిగే ప్రాంతంలో వేస్తుంటే ప్రజలు దుర్గంధం ద్వారా వచ్చే వాయువులను పీల్చుకొని చలికాలంలో వచ్చే ఆయా సం ఉబ్బసం వ్యాధుల పారిన పడుతున్నారని ఈ ప్రాంతాన్ని సిపిఎం నాయకులు ముంద్రు ఆంజనేయులు దశరథ ఈ వ్యర్థాలు కలిగి ఉన్న ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రజలకు తీవ్ర నష్టం కలిగించే ఈ విషవాయువులను నియంత్రించాలని ప్రజలు అధికారులను కోరుకుంటున్నట్లు తెలిపారు.

కాల్వల మరమ్మతు పనులు పూర్తి చేయాలి

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర - వేమూరు : నియోజక వర్గంలోని ఐదు మండలాల్లో పంట కాల్వల మరమ్మత్తులు,డ్రైనేజీ కాల్వల మరమ్మత్తులు త్వరితగతిన పూర్తి చేయాలని వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు సూచించారు. గురువారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్,డ్రైనేజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఇరిగేషన్ పనులు జరుగుతున్న తీరుతేన్నులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం అధికారులతో మాట్లాడుతూ గత ఐదేళ్లుగా కాల్వల మర మ్మతులు చేయక సాగునీరు సక్రమంగా సరఫరా కాలేదని చివరి భూములకు సాగు నీరు అందక రైతులు ఇబ్బందులకు గుర య్యారన్నారు.ఇప్పుడు అటువంటి పరిస్థితులు తలెత్తకుండా ఇరిగేషన్ శాఖ అధికారులు కాల్వల మరమ్మత్తుల పనులు చేపట్టి రైతులకు ఇబ్బంది లేకుండా చేయాలని సూచించారు. నిధులకు సంబంధించి కొరత ఉంటే ఉన్నతాధికారులతో మాట్లాడి నిధులు సమకూర్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాల్వల పనుల్లో రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సూచించారు.సమీక్షా సమావేశంలో ఇరిగేషన్,డ్రైనేజ్ శాఖ అధికారులు ఉన్నారు.

రైతుల కోసం ఎన్‌పీఎం షాప్ ప్రారంభం

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని జింఖానా క్లబ్‌లో గురువారం ఎన్‌పిఎం షాపును జిల్లా డిపిఎం అధికారి వాణిశ్రీ గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పురుగు మందులు లేకుండా ప్రకృతి సిద్ధంగా పండే వ్యవసాయం కొరకు ఎన్ పిఎం షాప్ ప్రారంభించడం జరిగిందని,ఈ షాపులో ఎన్‌పిఎం వ్యవసాయానికి కావలసిన అన్ని రకాల పురుగుల వినాశనం కొరకు కషాయాలు మొక్కలు పెరుగుదలకు అమృతాలు, ప్రకృతి వ్యవసాయంలో పండిన అన్ని రకాల ఉత్పత్తులు విక్రయిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం జానకి,వేటపాలెం యూనిట్ నిర్వాహకుడు మీసాల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కలకు కెమికల్స్ వాడొద్దు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : పట్టణంలోని అగ్రికల్చర్ బీటెక్ విద్యార్థులు ఈవీఎల్పి ట్రైనింగ్‌లో భాగంగా వివిధ రకాల కూంగాయ మొక్కలను, ఆకుకూర మొక్కలను పెంపుదల చేస్తున్నారు.

మొక్కలు పండించా లంటే కేవలం రైతే కానవసరం లేదు ఇదొక ఫ్యాషన్‌గా కూడా చేయవచ్చని విద్యార్థిని లావణ్య అన్నారు.బీటెక్ చివరి సంవత్సరం సందర్భంగా తమకు ఈ ట్రైనింగ్ జరుగుతుందని విద్యార్థులు అన్నారు.రైతు ఎప్పుడైతే ఎటువంటి కెమికల్స్ కలపకుండా వ్యవసాయం చేస్తాడో అప్పుడు ఎక్కువ మొత్తంలో ఆరోగ్యంతో పాటు లాభం కూడా పొందచ్చని విద్యార్థులు పేర్కొన్నారు.అతి తక్కువ ధరలో తమ కళాశాల నందు ఇండోర్ ప్లాంట్స్ లభిస్తాయని విద్యార్థులు వెల్లడించారు.ఇండోర్ ప్లాంట్స్ పెంపుదల చేయాలనుకున్న వారు ఎవరైనా ఉంటే తమను సంప్రదించవచ్చని విద్యార్థులు తెలియజేశారు. ఆకుకూరలతో పాటు వివిధ రకాల పూల మొక్కలు,కూరగాయల మొక్కలు తమ వద్ద లభిస్తాయని విద్యార్థులు పేర్కొన్నారు.

ఘనంగా ఫాతిమా జయంతి

విశాలాంధ్ర - అద్దంకి : భారతదేశ మొట్టమొదటి ముస్లిం మహిళ ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ 194వ జయంతిని స్థానిక ప్రకాశం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో గురువారం ఏపీ ఎస్సీ,ఎస్టీ,బిసి మైనారిటీస్ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ముందుగా ఫాతిమా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డోలా పద్మావతి మాట్లాడుతూ ఫాతిమా షేక్ నేటి మహిళా ఉపాధ్యాయులకు ఆదర్శప్రాయురాలు అని ఆమె స్ఫూర్తితో అందరూ సేవా దృక్పథంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు జ్యోతి రమేష్ బాబు,విశ్రాంత ఆర్జెడి దేవ పాలన,చారిత్రక పరిశోధకులు జ్యోతి చంద్రమౌళి,పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

13న నాగులపాలెంలో ముగ్గుల పోటీలు

విశాలాంధ్ర - పర్చూరు : సంక్రాంతి పండుగ సందర్భంగా పోలేరమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 13వ తేదీన నాగులపాలెంలో మండల స్థాయి ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ బహుమతి రూ.15,116,ద్వితీయ బహుమతి రూ.10,116, తృతీయ బహుమతి రూ.5,116గా నిర్ణయించినట్లు వివరించారు. ఈ పోటీల్లో పాల్గనదలచిన వారు రూ.200లు ప్రవేశ రుసుం చెల్లించి తమ పేర్లను 11వ తేదీ లోపల నమోదు చేయించుకోవాలని వారు ప్రకటనలో పేర్కొన్నారు.వివరాల కొరకు 7673939867,9948550440 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు స్వామివారి ఉత్తర ద్వార దర్శనం

విశాలాంధ్ర - పర్చూరు : మండలంలోని చెరుకూరులో వేంచేసి ఉన్న శ్రీత్రివిక్రమార్కతీశ్వర స్వామి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా అనగా శ్రీస్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడం జరుగుతుందని,భక్తులు స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదములు స్వీకరించాలని ఆలయ కార్య నిర్వహణ అధికారి మల్లవరపు నాగయ్య తెలిపారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నిష్పాక్షిక వార్తలను ప్రచురిస్తూ నిబద్ధతకు నిలువెత్తు దర్పణంగా విశాలాంధ్ర దినపత్రిక నిలిచిందని చీరాల మండల తహశీల్దార్ కె.గోపీకృష్ణ అన్నారు.విశాలాంధ్ర-2025 నూతన క్యాలెండర్‌ను తహశీల్దార్ కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలోని అవినీతిని వెలికితీసి ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తూ సమాజ అభివృద్ధికి కృషి చేస్తున్న విశాలాంధ్ర అశేష పాఠకుల మన్ననలు పొందుతున్నదన్నారు.ఈ కార్యక్రమంలో వీఆర్ఓ కళ్యాణ్,సిబ్బంది,చీరాల రూరల్ విలేకరి కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని యనమదల గ్రామంలో ప్రాథమికొన్నత పాఠశాలలో ముందస్తు సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో చిన్నారులు సాంప్రదాయ దుస్తులలో కనువిందు చేశారు.చిన్నారులకు ఆటల పోటీలు,ముగ్గుల పోటీలు నిర్వహించి బహుమ తులు అంద జేశారు.చిన్నారులకు పండుగ ప్రాముఖ్యాన్ని వివరించారు. ప్రధానో పాధ్యాయురాలు లక్ష్మీ భవాని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు నష్టపరిహారం ఇవ్వాలి

- జై బీమ్ రావ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య

విశాలాంధ్ర - బాపట్ల : తిరుమల వైకుంఠ ద్వార దర్శనం టికెట్ల విడుదల నేపథ్యంలో తిరుపతిలోని విష్ణు నివాసం దగ్గర జరిగిన తొక్కిసలాటలో భక్తులు మృతి చెందడం మమ్మల్ని తీవ్ర మనోవేదనకు గురిచేసిందని జై బీమ్ రావ్ భారత్ పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య విచారం వ్యక్తం చేశారు.మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని పర్రె కోటయ్య డిమాండ్ చేశారు.ఈ ఘటనపై విచారణ జరిపించి మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని,మృతుల కుటుంబాలకు టీటీడీలో శాశ్వత ఉద్యోగం కల్పించాలని,గాయపడిన వారికి మెరుగైన వైద్యం కల్పించి,ఆర్థిక సహాయం చేయాలని డిమాండ్ చేశారు.ఇటువంటి అవాంచనీయ ఘటనలకు తావీయకుండా టీటీడీ మరింత పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు.మృతి చెందిన భక్తుల కుటుంబాలకు ప్రభుత్వం,టీటీడీ అండగా ఉండాలని కోరారు.

జీ తెలుగులో సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- ఒంగోలు: జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ గా జీ వినియోగదారులకు సరికొత్త కార్యక్రమాలను సిద్ధమైందని సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 6 గంటలకు విక్టరీ వెంకటేష్ నటించిన సంక్రాంతి సంబరాలకు వస్తున్నాం సినిమాను, 12వ తేదీ సాయంత్రం 5. 30 గంటలకు పాన్ ఇండియా బిగ్గెస్ట్ బ్లాక్బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాను, 13 వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమాలను ప్రసారం చేయనున్నామన్నారు. కాకినాడ వేదికగా జరిగిన 'సంక్రాంతి సంబరాలకి వస్తున్నాం' కార్యక్రమంలో జీ తెలుగు తారలతో పాటు ' విక్టరీ వెంకటేష్, దర్శకుడు అనిల్ రావిపూడి, హీరోయిన్లు ఐశ్వర్య రాజేష్, మీనాక్షి చౌదరి పాల్గొని అభిమానులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ నటించిన మోస్ట్ అవైటెడ్ గ్లోబల్ బ్లాక్ బస్టర్ కల్కి 2898 ఏడీ సినిమాని జీ తెలుగు అందిస్తోందన్నారు. ఈ సినిమా చూసే ప్రేక్షకులకు జీ తెలుగు వాచ్ అండ్ విన్ కాంటెస్ట్ని నిర్వహిస్తోందన్నారు. జీ తెలుగు. మీరు చేయాల్సిందల్లా కల్కి సినిమా చూస్తూ టీవీ స్క్రీన్పై వచ్చే క్యూఆర్ కోడ్ని స్కాన్ చేయడం లేదా www.kalkionzeetelugu.zee5.com లో లాగిన్ అయి కల్కి గేమ్ ఆడి అదిరిపోయే బహుమతులు గెలవచ్చన్నారు. సంక్రాంతి సంబరాలకి కొనసాగింపుగా సంక్రాంతి సంబరాలు ఫైర్ వర్సెస్ వైల్డ్ ఫైర్ కార్యక్రమం లో యాంకర్ రవి, వర్షిణి వ్యాఖ్యాతలుగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు, జీ తెలుగు తారలు అత్తలు, కోడళ్లు పేరున రెండు టీమ్లుగా ఏర్పడి వినోదం పంచేందుకు పోటీపడ్డారన్నారు. సాగిన ఈ కార్యక్రమాలను జీ తెలుగు వేదికగా మీరూ తప్పకుండా చూడాలన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు

విశాలాంధ్ర- కొల్లూరు : సంక్రాంతి సంభరాలు మండల కేంద్రం కొల్లూరు శ్రీ సాయి వాసవి విద్యా సంస్థల్లో ఘనంగా జరిగాయి. గురువారం విద్యా సంస్థల ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం భోగి మంటలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో విద్యా సంస్థల డైరెక్టర్ ఉప్పు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అక్రమ మద్యం విక్రేత అరెస్ట్

విశాలాంధ్ర - అద్దంకి : అక్రమంగా మద్యం అమ్ముతున్న బల్లికురవ మండలం మల్లాయపాలెం గ్రామానికి చెందిన మణితేజను గురువారం అద్దంకి ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి అతని వద్ద అమ్మకానికి ఉంచిన ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు అద్దంకి ఎక్సైజ్ సిఐ భవాని తెలిపారు.

ఉపాధి హామీ పథకంతో జీవనోపాధికి చర్యలు

కలెక్టర్ జె.వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : గ్రామాలలోని నిరుపేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా జీవనోపాధి కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అధికారులను ఆదేశించారు.గురువారం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుండి మండల అధికారులతో వీక్షణ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాపట్ల జిల్లాలోని 25 మండలాలలో కేటాయించిన పనులను వందశాతం పూర్తి చేయాలన్నారు.ప్రతి మండలంలో మొక్కలు నాటే కార్యక్రమం,కాలువ తవ్వకాలు,నీటినిల్వల ట్యాంకులు ఏర్పాటు చేయాలన్నారు.నిర్దేశించిన లక్ష్యాలను గడువులోపు పూర్తి చేయాలన్నారు.మండల స్థాయి అధికారులు వారి మండలాలలో రోజుకు 10 వేల154 మందితో పని చేయిస్తామని యాప్‌లో డిమాండ్ పెడుతున్నారన్నారు.రోజుకు 6617 మంది మాత్రమే పనిచేస్తున్నట్లు ఎంఎంఎస్ యాప్ ద్వారా తెలుస్తుందన్నారు.జిల్లాలో 2.77 వేల లక్ష్యాలు పెట్టుకున్నామని తెలిపారు.డిమాండ్ ఇచ్చిన దానికి పనిచేసే దానికిలా వ్యత్యాసాలను గమనించి పని చేయించాలన్నారు. 10వేల పని దినాలు పనిచేస్తామని తెలిపి 6 వేల పని దినాలే చేయిస్తున్నారన్నారు. రోజుకు13 వేల పని దినాలు లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. వంద రోజులు పని దినాలను మండలాలలో 27,843 కుటుంబాలకు కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికీ 1935 కుటుంబాలకు పని కల్పించామన్నారు.ప్రణాళిక ప్రకారం కుటుంబాలకు పని కల్పించిన ఎడల లక్ష్యాలను పూర్తి చేయగలమన్నారు. ప్రతి మండలంలో ఎస్సీ,ఎస్టి,ఇతర కులాలకు జాబ్ కార్డులు ఇవ్వడం జరిగిందన్నారు.ఎస్సీ కులాల కుటుంబాలకు 34.46శాతం,ఎస్టి కులాల కుటుంబాలకు 33.29 శాతం, కులాల కుటుంబాలకు 35.04శాతంగా పని దినాలు కల్పించాలన్నారు.ఇతర కులాల కుటుంబాల కంటే ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఎక్కువ పని దినాలు కల్పించాలని ఆయన అధికారులకు సూచించారు.జిల్లాలో పాశువుల షెడ్డు ఏర్పాటుకు ఉన్న లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు.ఇప్పటికీ 183 బేస్మెంట్ లెవెల్,170 గ్రౌండ్ లెవెల్లోనే ఉన్నాయన్నారు.నిర్దిష్ట సమయానికి పూర్తిచేయాలని అధికారులకు సూచించారు.ప్రజా సమస్యల ఫిర్యాదుల విషయంలో ఫిర్యాదులు పునరావత ˊమవుతున్నాయన్నారు. ఫిర్యాదులు పునరావడం కాకుండా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి కె.ఉమా,ఇతర అధికారులు పాల్గొన్నారు.

రీ సర్వేలో అధికారులు అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - మార్టూరు : త్వరలో ప్రారంభంకానున్న భూముల రీ సర్వేలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని బాపట్ల ఆర్డిఓ గ్లోరియా అన్నారు.మార్టూరు తాహశీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో ఆమె అధికారులను ఉద్దేశించి మాట్లాడారు.ప్రస్తుతం మండలానికి ఒక్క గ్రామం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని అందులో భాగంగా మండలంలోని రాజుపాలెం గ్రామంలో దేవాదాయ శాఖ భూములు వక్ఫ్‌బోర్డు భూములను ప్రత్యేకంగా గుర్తించి రైతుల భూముల సర్వేలు పూర్తి చేయాలన్నారు.కార్యక్రమంలో పర్చూరు, యద్దనపూడి,మార్టూరు తాహశీల్దార్లు బ్రహ్మయ్య, రవిబాబు,ప్రశాంతి,జిల్లా సర్వేయర్ శ్రీనివాసరావు,మండల వీఆర్వోలు, సర్వేయర్లు, అధికారులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నివారించి హరితాంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ప్లాస్టిక్ వినియోగం నివారించి హరిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మిద్దాం అని బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ రెడ్డి తెలిపారు.మున్సిపల్ కమిషనర్ చేతులు మీదుగా ప్లాస్టిక్ రహిత బాపట్లగా తీర్చిదిద్దాలి అనే కరపత్రిక ఆవిష్కరించారు.ఈ కార్యక్రమానికి కవిత సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షులు డాక్టర్ గుదే రాజారావు అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ భావితరాల భవిష్యత్ కొరకు ముందుగానే ఆలోచన చేసి ప్లాస్టిక్ మహమ్మారిని తరిమి కొట్టే క్రమంలో జూలై 1వ తేదిన 2022 ప్లాస్టిక్ నిషేధించారన్నారు.19 రకములుగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు నిషేధించడం జరిగినదన్నారు.భారత ప్రభుత్వం తీసుకున్న ఒక గొప్ప చారిత్రాత్మక నిర్ణయం అన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల భవిష్యత్ కొరకు ప్లాస్టిక్ నిషేధించే విషయంలో ముందడుగు వేయడం గొప్ప నిర్ణయం, అలాగే మనం కూడా చేయి చేయి కలిపి సింగల్ యూజ్ ప్లాస్టిక్ని నిషేధించడానికి ప్రతి ఒక్కరు కలసి నడుద్దాం అన్నారు.ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలు ప్రాణ అపాయం అందరికి తెలుసు కావున మనం ప్లాస్టిక్ వాడకం నిషేదిద్దాం,మన ముందు తరాలను,చిన్న పిల్లలను కాపాడుకొనే దిశగా మనం యుద్ధప్రాతిపదికన నిషేధాన్ని అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్, కన్నెగంటి జాన్ వెస్లీ, పొందుగుల ప్రసాదరావు, ఏపూరి జోసెఫ్,పాస్టర్ అమర్నాథ్ పాల్గొన్నారు.

షెడ్యూల్డ్ కులాల కులగణనపై సామాజిక తనిఖీ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : షెడ్యూల్డు కులముల కుల గణనపై సామాజిక తనిఖీ నిర్వహించి,అభ్యంతరాలు 12వ తేదీ వరకు స్వీకరిస్తామని జిల్లా కలెక్టరు జె.వెంకట మురళి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

షెడ్యూల్డు కులముల కుల గణన వివరాలను గ్రామ,వార్డు సచివాలయాలలో ప్రదర్శించాలని దీనిపై వచ్చే అభ్యంతరాలను వచ్చే 16 వ తేదీ వరకూ క్షేత్రస్థాయిలో పరిశీలిస్తామన్నారు.

కులగణన తుది వివారాలను వచ్చే నెల 20న సచివాలయాల్లో ప్రదర్శిస్తామని తెలిపారు.కుల గణనపై వచ్చిన అభ్యంతరాలు గ్రీవేన్స్ మూడు దశల్లో తనిఖీలుంటాయన్నారు.

తిరుపతి ఘటనపై ఎమ్మెల్యే ఏలూరి దిగ్భ్రాంతి

విశాలాంధ్ర - మార్టూరు : తిరుపతిలో తొక్కిసలాట ఘటన తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని తెలుగుదేశంపార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు.దైవ దర్శనం కోసం వెళ్లిన భక్తులు మృతి తీవ్ర మనోవేదనకు గురిచేసిందన్నారు. ఆరుగురు యాత్రకులు మృతి చెందడం పట్ల ఎమ్మెల్యే ఏలూరి సంతాపం తెలిపారు.ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు ఆయన తెలిపారు.భగవంతుడి దర్శనం కోసం వచ్చిన భక్తులు దుర్మరణం పాలవడం దురదృష్టకరమన్నారు.మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.మృతుల కుటుంబాలకు భగవంతుడు మనోధైర్యం ఇవ్వాలని ప్రార్థించారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : సంక్రాంతి నూతన సంవత్సర శుభాకాంక్షలుతో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పర్చూరు నియోజకవర్గ ఇన్చార్జి గాదె మధుసూదన రెడ్డి పార్టీ నాయకులు కార్యకర్తలుతో కలసి క్యాలెండర్ ఆవిష్క రించారు.జిల్లా ప్రజలకు ముందుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రజలు అందరూ పాడిపంటలతో సుఖ సంతోషాలతో ఆనందోత్సాహాలతో కుటుంబ సభ్యులు అందరూ కలిసి ఈ సంక్రాంతి సంక్రాంతి పండుగను జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ గాదె యువసేన ఆధ్వర్యంలో 2025 నూతన సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో గోవతోటి విజయ్,కుంచల వీరరాఘవరెడ్డి,మారుబోయిన శ్రీనివాస్ రెడ్డి,దేగల రవి రెడ్డి,కుంచల కిరణ్ కుమార్ రెడ్డి,పులుగు సుబ్బారెడ్డి,యెత్రి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా దేహదారుఢ్య పరీక్షలు

విశాలాంధ్ర-ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ పోలీస్ స్టేట్ లెవెల్ రిక్రూట్మెంట్ బోర్డు నియమ నిబంధనలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి పకడ్బంధీగా గురువారం జిల్లా పోలీసు మైదానంలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహణ క్రమంలో అభ్యర్థుల ధ్రువీ కరణ పత్రాలు పరిశీలన, బయోమెట్రిక్, ఎత్తు ,ఛాతీ కొలత వంటి ఫిజికల్ మెజర్మెంట్లు చేయ బడతాయని, దేహదారుఢ్య పరీక్షలలో భాగంగా 1600 మీటర్లు, 100 మీటర్లు, లాంగ్ జంప్ వంటి అంశాలను ఆధునిక కంప్యూటరైజ్డ్ టెక్నాలజీ ద్వారా సాంకేతిక పరిజ్ఞానం పరికరాలతో పకడ్బందీగా జిల్లా ఎస్పీ దామోదర్ పర్యవేక్షణలో నిర్వహించడం జరిగింది. దేహదారుఢ్య పరీక్షలకు హాజరైన అభ్యర్థులతో జిల్లా ఎస్పీ మాట్లాడి ఈవెంట్స్ సమయంలో పాటించ వలసిన టెక్నిక్స్ ను గురించి అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. గురువారం న 552 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో 365 మంది అభ్యర్థులు క్వాలి ఫైడ్ అయ్యారు. అభ్య ర్థుల దేహదారుఢ్య, పరుగు పరీక్షల వివరాలను సాంకేతిక పరిజ్ఞానంతో నమోదు చేసి భద్రపరస్తున్నట్లు, గ్రౌండ్లో సీసీ కెమెరాలు మరియు డ్రోన్ కెమెరాతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గారు తెలిపారు. ఎవరైనా అభ్యర్థులు ఆరోగ్య సమస్యలు మరియు వివిధ కారణంగా కాల్ లెటర్ లో తెలిపిన తేదీన దేహదారుఢ్య పరీక్షలలో పాల్గొన లేకపోతే చివరి రోజు పాల్గొన్నవచ్చునని మరియు మహిళలు/పురుషులు అప్పీల్ చేయదలచిన అభ్యర్థులు చివరి రోజు జిల్లా పోలీస్ గ్రౌండ్లో తమ అప్పీల్ అందించి, ఈవెంట్స్ చేయడానికి అనుమతి పొందే అవకాశం ఉన్నది. దళారులను ఆశ్రయించి మోసపోవద్దని... మెరిట్ ఆధారంగానే ఈ ఉద్యోగాలు వస్తాయని అభ్యర్థులకు జిల్లా ఎస్పీ తెలియజేశారు. ఈ ఈవెంట్స్ లో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్)కె. నాగేశ్వరరావు, డిఎస్పీ సురేష్ బాబు, దర్శి డిఎస్పీ లక్ష్మి నారాయణ, పిటిసి డిఎస్పీ మాధవ రెడ్డి, పిటిసి డిఎస్పీ లక్ష్మణ్ కుమార్, డీపీఓ రామ్మోహన్ రావు, ఐటి కోర్ సీఐ వి. సూర్యనారాయణ, డీటీసీ సీఐ షమీముల్లా, పిటిసి సిఐ శ్రీనివాసరరావు, ఆర్ఐలు మనోహర్, రమణారెడ్డి, సీతారామిరెడ్డి, షైక్ ఖాసీం, ఎస్సైలు, డీపీఓ సిబ్బంది, మెడికల్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ అకౌంట్స్ కమిటీ స్టడీ టూర్లో ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు: పబ్లిక్ అకౌంట్స్ కమిటీ స్టడీ టూర్ పర్యటనలో భాగంగా హైదరాబాద్ లోని తాజ్ ఫలక్నుమా హెటల్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఒంగోలు ఎంపి మాగుంట కమిటీ ఛైర్మన్తో కలిసి పాల్గొన్నారు. ఈ సమావేశంలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖా, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్ప్రైజెస్, హైదరాబాద్ ప్రతినిధులతో "శిక్షణా సంస్థలకు సహాయ పథకం" అనే అంశంపై సమీక్షించారు. కేంద్ర పెట్రోలియం, నేచురల్ గ్యాస్ మంత్రిత్వ శాఖ ప్రతినిధులు మరియు ఆయిల్ మరియు నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ చైర్మన్ తో, ఇండియన్ ఆయిల్ అండ్ హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క ప్రతినిధులతో "ఇంధన రంగంలో పరివర్తన కోసం తీసుకోవాల్సిన తగు చర్యలు" పై ఏర్పాటు చేసిన సమీక్షించారు. ఈ సమావేశంలో పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ కె.సి. వేణు గోపాల్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అమిత్‌షాను కేంద్ర మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలి

విశాలాంధ్ర-ఒంగోలు: పార్లమెంట్ సమావేశాలలో ఈ దేశ రాజ్యాంగాన్ని రచించి, ఈ దేశ సమగ్రతను ప్రపంచానికి చాటి చెప్పి, అపర మేధావిగా కీర్తించబడుతున్న ప్రపంచ మేధావి, నవ యుగ వైతాళికుడు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ను కించపరుస్తూ కేంద్ర హెూం శాఖ మంత్రి అయినటువంటి అమిత్ షా అభ్యంతరకర భాష వాడుతూ కించపరిచిన విధా నాన్ని నిరసిస్తూ, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి, రాజ్యాంగం ద్వారా లబ్ధి పొందుతున్నటువంటి ఇటువంటి వ్యక్తులు, రాజ్యాంగం రచించినటువంటి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ను విమర్శించడానికి వ్యతిరేకిస్తూ అమిత్ షాను వెంటనే మంత్రివర్గం నుండి బర్తరఫ్ చేయాలని రాబోయే మున్సిపల్ కౌన్సిల్ సమావేశాలలో తీర్మానం చేయాలని గురువారం ఉదయం ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త బిఆర్ గౌస్ ఆధ్వర్యంలో ఒంగోలు నగర కార్పొరేషన్ కమిషనర్ కోడూరి వెంకటేశ్వరరావు ని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గౌస్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఏర్పడిన నాటినుండి గడిచిన 11 సంవత్సరాల లో ప్రతిరోజు రాజ్యాంగంపై విషం చిమ్ముతూ, రాజ్యాంగబద్ధమైన సంస్థలను నిర్వీర్యం చేస్తూ ఈరోజు రాజ్యాంగం రచించినటువంటి అంబేద్కర్ను విమర్శించడం సిగ్గుచేటని, భారత దేశంలో రాజ్యాంగాన్ని పక్కనపెట్టి మను శాస్త్రాన్ని అమలు చేయాలనే ఆర్ఎస్ఎస్అజెండాతో బిజెపి ప్రభుత్వం ముందుకు వెళుతుందని, లౌకికవాదులు రాజ్యాంగ శ్రేయోభిలాషులు అందరూ ఈ చర్యలను వ్యతిరేకించాలని గౌస్ కోరారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర కో చైర్మన్ ఉద్దండి మల్లికార్జునరావు, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు షేక్ రసూల్, ఒంగోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి, ఒంగోలు నగర మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ అబ్దుల్ రవుఫ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ కరీం బేగ్, యువజన కాంగ్రెస్ ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గం అధ్యక్షుడు రాయపాటి గిడియన్, జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ సుధీర్ వర్మ యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ ఇమామ్, దండుపాలు ప్రసాద్ ,కల్లూరి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భక్తులు మృతి బాధాకరం

-టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలి!

-ఒంగోలు అసెంబ్లీ వైసీపీ సమన్వయ కర్త చుండూరి రవిబాబు

విశాలాంధ్ర-ఒంగోలు: తిరుమల స్వామి వారి వైకుంఠ ద్వారా దర్శనం కోసం వచ్చిన భక్తుల తోపులాట, తొక్కిసలాట కారణంగా ఆరుగురు మరణించడం అత్యంత బాధాకరమైన విషయమని ఒంగోలు నియోజక వర్గం వైస్సార్సీపీ సమన్వ యకర్త చుండూరి రవిబాబు పేర్కొన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. స్వామి వారి దర్శనం కోసం లక్షలాదిగా భక్తులు వస్తారని ముందుగానే అంచనా ఉన్నప్పటికీ,టీటీడీ పాలకమండలి, అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని, ఇది తగదని పేర్కొన్నారు.. ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ టీటీడీ చైర్మన్ వెంటనే రాజీనామా చేయాలనీ రవిబాబు డిమాండ్ చేసారు. అధికార పార్టీ పెద్దలు, ప్రజా ప్రతినిధుల సేవలో తరిస్తూ, సామాన్య భక్తుల మరణాలకు పరోక్షంగా కారణమైన టీటీడీ పాలకమండలి మొత్తం రద్దు చేయాలని,చైర్మన్ వెంటనే తప్పుకోవాలని రవిబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు.. "టీటీడీ అధికారులు కానీ, పాలకమండలి కానీ.. ఉత్తుత్తి ప్రచారానికి ఇస్తున్నంత సమయం ఏర్పాట్ల కోసం ఇవ్వలేదు అనిపిస్తుంది. టోకెన్లు జారీ కేంద్రాలు సమాచారం సరిగా లేదు, లక్షలాది భక్తులకు తగిన ఏర్పాట్లు లేవు, భక్తుల భద్రత విషయంలో ఏమరుపాటు తగదు.. ఇంకా దర్శనాలు ఆరంభం కాకుండానే ఈ ఘటన జరగడం దురదృష్టకరం. మృతుల కుటుంబాలకు టీటీడీ తరపున ఆదుకోవాలి. వీలైతే వారి కుటుంబ సభ్యులకు టీటీడీలో ఉద్యోగాలు ఇవ్వాలి. అలాగే రానున్న రోజుల్లో ఏ ఒక్క ప్రాణము పోకుండా చూసుకో వాల్సిన బాధ్యత మొత్తం టీటీడీ పాలకమండలి, ప్రభుత్వంపై ఉంది. దీనిలో ఏమాత్రం అలసత్వం తగదు.. వైకుంఠ ద్వారా దర్శనాలు జరిగినన్ని రోజులు మరింత అప్రమత్తంగా ఉంటూ.. వీఐపి తాకిడి, సేవ తగ్గించి, సామాన్య భక్తులకు ఇబ్బందులు లేకుండా చూస్తారని ఆశిస్తున్నాను" భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలి అని చుండూరి రవిబాబు ప్రకటన జారీ చేశారు.

కొత్త రవికి డాక్టరేట్ ప్రధానం

విశాలాంధ్ర - బాపట్ల : యోగి వేమన విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్రం,ప్రభుత్వ పాలన శాస్త్రం పరిశోధకుడు కొత్త రవికు విశ్వవిద్యాలయం డాక్టరేటను ప్రకటించింది. విశ్వవిద్యాలయం, రాజనీతి శాస్త్రం,ప్రభుత్వ పాలనా శాస్త్రం సహా ఆచార్యులు డాక్టర్ డి.ఆర్ సతీష్‌బాబు పర్యవేక్షణలో ఎడ్యుకేషన్ పాలసీస్ ఇన్ ఇండియా,ఎకేస్‌స్టడీఆఫ్ షెడ్యూల్డ్ కాస్ట్ స్టూడెంట్స్ ఇన్ స్కూల్స్ ఆఫ్ ప్రకాశం డిస్ట్రిక్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై పరిశోధన చేసి రూపొందించిన సిద్ధాంత గ్రంధాన్ని కొత్త రవి విశ్వవిద్యాలయ పరీక్షలు విభాగానికి సమర్పించారు. యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్యులు డాక్టర్ కె.కృష్ణారెడ్డి మార్గదర్శకం మేరకు నిపుణుల బృందం,పరిశోధకుడు కొత్త రవి పరిశోధన చేసి రూపొందించిన గ్రంథం అధ్యయనం చేసి డాక్టరేట్ అర్హత ఉందంటూ ధ్రువీకరించారు. ఈ మేరకు కొత్త రవికు డాక్టరేట్ ప్రొసీడింగ్స్‌ను వైవియు పరీక్షల నిర్వహణ అధికారి కృష్ణారావు జారీ చేశారు. ఈ సందర్భంగా కొత్త రవిను యూనివర్సిటీ ఉపకులపతి ఆచార్యులు కే.కృష్ణారెడ్డి, కులసంచి వులు ఆచార్య పి. పద్మ,ప్రధానా ఆచార్యులు ఎస్.రఘునాథ్ రెడ్డి,రాజనీతి శాస్త్రం ప్రభుత్వం పాలనా శాస్త్రం ఆచార్యులు,సహా ఆచార్యులు, అధ్యాపకు లు,పరిశోధన విద్యార్థులు అభినందించారు.

దేవాలయాల వద్ద పోలీసుల పటిష్ట బందోబస్తు

విశాలాంధ్ర-ఒంగోలు: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శు క్రవారం ప్రముఖ దేవాలయాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్ తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా దర్శనం జరిగేలా చూడాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. దేవాలయాల వద్ద అలంకరణ కోసం కరెంటు వైర్లు వేలాడు విషయంలో దేవాదాయ అధికారులు నిరంతరం పరిశీలన ఉండాలన్నారు. దేవాదాయ, రెవిన్యూ, పోలీసు అధికారుల సమన్వయంతో దేవాలయ ప్రాంగణాలలో బారికేడ్లు ఏర్పాటు చేసుకోవాలని, దేవాలయాల వద్ద దొంగతనాలు జరుగకుండా అనుమానిత వ్యక్తులపై కూడా నిఘా ఉంచాలని, ఎవరూ విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని స్పష్టంచేశారు. భక్తులు ప్రశాంతమైన వాతావరణంలో స్వామివారిని దర్శించుకొని, పోలీస్ వారికి సహకరించి ఈ వైకుంఠ ఏకాదశి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బీచ్ హ్యాండ్ బాల్ పోటీల్లో ప్రకాశం జిల్లాకు తృతీయస్థానం

విశాలాంధ్ర-ఒంగోలు: ఈనెల నాలుగో మరియు ఐదవ తేదీలలో విశాఖపట్నం ఆర్కే బీచ్ ఆవరణంలో మొట్టమొదటిసారిగా ప్రకాశం జిల్లారాష్ట్ర బీచ్ హ్యాండ్ బాల్ అసోసియేషన్ సెక్రటరీ సత్యరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ పోటీలలో ప్రకాశం జిల్లా తరుపున స్థానిక పేస్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి వి అజీష్ వలి ప్రకాశం జిల్లాకు ఎంపికై రాష్ట్ర బీచ్ హ్యాండ్ బాల్ పోటీలలో పాల్గొనడం జరిగింది. ఈ పోటీలలో ప్రకాశం జిల్లా మూడవ స్థానం కైవసం చేసుకుంది. ఇందులో అజీస్ వలి అద్భుత ప్రదర్శన కనపరిచి జాతీయ బీచ్ హ్యాండ్ బాల్ జట్టుకు ఎంపిక అవ్వడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ మద్దిశెట్టి శ్రీధర్ పాల్గొని గెలుపొందిన క్రీడాకారుని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి,డీన్ ఆఫ్ అకాడమిక్స్ డాక్టర్ సి వి సుబ్బారావు,డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ ఆర్ వీరాంజనేయులు,డీన్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్స్ శ్రీమతి రూప అకేష్,డాక్టర్ ఎస్.గిరి బాబు,ఫిజికల్ డైరెక్టర్లు మరియు అధ్యాపక అధ్యాపకతర సిబ్బంది పాల్గొని ఈ సభను విజయవంతం చేశారు.

అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ రాళ్లు పట్టివేత

విశాలాంధ్ర-చీమకుర్తి : ప్రకాశం జిల్లా చీమకుర్తిలో అక్రమంగా తరలిస్తున్న గ్రానైట్ రాళ్లను విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ అధికారులు లారీని పట్టుకొని కేసు నమోదు చేసి ఏపీఎండిసి ప్రాంగణంలోకి తరలించారు. ఒకపక్క మైనింగ్ అధికారులు రోజు తనిఖీలు నిర్వహిస్తున్నప్పటికీ అక్రమంగా గ్రానైట్ తరలిస్తున్న వ్యక్తులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా ఉండటం లేదు. ఈ గ్రానైట్ మాఫీ ఇలాగే కొనసాగితే ప్రభుత్వానికి వచ్చే ఆదాయం గండిపడుతుంది.

సోలార్ పవర్ కార్పొరేషన్ డైరీ,క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి గొట్టిపాటి

విశాలాంధ్ర - అద్దంకి : ఏపీ సోలార్ పవర్ కార్పొరేషన్ 2025 డైరీ,క్యాలెండర్‌ను గురువారం చీఫ్ సెక్రెటరీ విజయానంద్‌తో కలిసి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సచివాలయంలోని మంత్రి ఛాంబర్‌లో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పునరుత్పాదక రంగానికి ఏపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు.ఇందులో భాగంగానే ఏపీ ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీని రూపొందించినట్లు పేర్కొన్నారు.గతంలో రాష్ట్రాన్ని విడిచి వెళ్లిన పునరుత్పాదక రంగం పెట్టుబడిదారులను ఆహ్వానిస్తున్నట్లు వివరించారు.రాష్ట్రంలో సోలార్ పవర్ కార్పొరేషన్ పనితీరును అభినందించారు.నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో కార్పొరేషన్ కృషి అభినందనీయమని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీఎస్ కె.విజయానంద్,ఏపీ జెన్కో ఎండీ చక్రధర్ బాబు,ట్రాన్స్‌కో జేఎండీ కీర్తి చెకూరి, సీపీడీసీఎల్ సీఎండీ పఠాన్ శెట్టి రవి సుభాష్,సోలార్ పవర్ కార్పొరేషన్ ఎండీ కమలాకర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర క్యాలెండర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : జాతీయ తెలుగు దిన పత్రిక విశాలాంధ్ర నూతన సంవత్సర క్యాలెండర్ పిఎస్‌కె నర్సింగ్ కళాశాల చైర్మన్ పేర్లి సునీల్,సెక్రెటరీ సంపత్ కుమారి గురువారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 76 సంవత్సరాలుగా నిజ వార్తలు నిర్భయంగా సేకరిస్తూ,ప్రజా సమస్యలపై అధికా రులను,ప్రజా ప్రతినిధులను ప్రశ్నిస్తూ, పాఠకులతో మమేకమై విశాలాంధ్ర పత్రిక చేస్తున్న విశిష్ట సేవలు ఎనలేనిదన్నారు.విశాలాంధ్ర పాఠకులకు,విలేకర్లకు, సిబ్బందికి,విద్యార్థుల తల్లిదండ్రులు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీచింగ్ సిబ్బంది రత్నాకర్,సుష్మా,ఆషా, ఆంజమ్మ, వాసంతి, నర్సింగ్ కళాశాల విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

నేడు సీపీఐ బీకేఎంయూ ఆధ్వర్యంలో అర్జీలు

- హాజరుకానున్న మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్

విశాలాంధ్ర - బాపట్ల : అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరుతూ సీపీఐ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేయంయూ) ఆధ్వర్యంలో శుక్రవారం తహశీల్దారు కార్యాలయాల వద్ద అర్జీలు సమర్పణ కార్యక్రమం జరుగుతుందని సీపీఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ తెలిపారు. బాపట్ల తహశీల్దారు కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ పాల్గొంటారన్నారు. జిల్లాలోని అన్నీ తహశీల్దారు కార్యాలయాల వద్ద సీపీఐ బీకేయంయూ నాయకులు అర్జీల సమర్పణ కార్యక్రమంలో పాల్గొని అర్హులతో కలిసి అర్జీలు అందించాలని కోరారు. ఇంటి స్థలం లేని ప్రతి ఒక్కరూ తహశీల్దారు కార్యాలయానికి వచ్చి అర్జీలు ఇవ్వాలని సూచించారు.

చిన్నారులకు ఆధార్ కార్డులను తీయించాలి

సీడీపీఓ సీహెచ్ భారతి

విశాలాంధ్ర-తాళ్లూరు : బంగారు బాల్యంలో బాగంగా చిన్నారులకు ఆధార్ కార్డులను తక్షణమే తీయించాలని సీడీపీఓ సిహెచ్ భారతి కోరారు. మండలంలోని వెలుగు వారి పాలెం, తూర్పుగంగవరం మన్నేపల్లి గ్రామాలలో ప్రత్యేకంగా జరుగుతున్న ఆధార్క్యాంపులను సీడీపీఓ సీహెచ్ భారతి, సూపర్‌వైజర్ జ్యోతి లు పరిశీలించారు. ఇప్పటి వరకు ఆయా క్యాంపులలో 86 మందికి ఆధార్ కార్డులు తీసినట్లు తెలిపారు.

సుస్థిర జీవనోపాధుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ

విశాలాంధ్ర - కర్లపాలెం : మహిళా సంఘాల సుస్థిర జీవనోపాదుల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ తెలిపారు. కర్లపాలెం మండల సమాఖ్య ఆధ్వర్యంలో బ్యాంకర్ల సమన్వయంతో ఆర్థిక స్వావలంబన రుణ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని డ్వాక్రా మహిళాలతో కేక్ కట్ చేసి నూతన సంవత్సర సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ నవ్యాంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబునాయుడు పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా డ్వాక్రా సంఘాల విస్తరించి మహిళా కుటుంబాల తలసరి ఆదాయం లక్షకి మించి,నెలకు కనీసం రూ. 10,000 ఆదాయం పొందే విధంగా సుస్థిరమైన జీవనోపాదులు కల్పనే ప్రధాన లక్ష్యం అన్నారు. ప్రభుత్వ కల నిజం చేసి ప్రతి మహిళాని లక్షాధికారి కావాలన్నారు.బ్యాంకు ఋణం 43 సంఘాలకు రూ.7.47 కోట్లు లఖ్ పతి దిది జీవనోపాది రుణాలు 110 మందికి రూ.1.20 కోట్లు స్త్రీనిధి రుణాలు 150 మంది సభ్యులకు రూ.1.50 కోట్లు మొత్తం రూ.10.17 కోట్లలు నమూనా చెక్కు మహిళలకు సంక్రాంతి శుభాకాంక్షలతో అందజేశారు.ఈ కార్యక్రమం అనంతరం లీడ్ బ్యాంకు మేనేజర్ శివకృష్ణ బ్యాంకు మేనేజర్‌లు యూనియన్ బ్యాంకు మానస,సి.జి.జి.బి బ్యాంకు మురళీ కృష్ణ ఇండియన్ బ్యాంకు రత్నజ్యోతిలకు ఎమ్మెల్యే దుశ్శాలవతో సత్కరించారు. ఈ కార్యక్రమలో ఎం.ఆర్.ఓ కేవిబిటి సుందరమ్మ,ఎంపిడిఓ అద్దూరి శ్రీనివాసరావు,కర్లపాలెం మండలం జనసేన అధ్యక్షులు శ్రీకృష్ణ, పార్లమెంట్ సమన్వయకర్త నక్కల వెంకట స్వామి,మండల పార్టీ అధ్యక్షులు భూపతిరావు,మహిళా పార్టీ అధ్యక్షురాలు సునీత,ఎంపిటిసి పఠాన్,సిబ్బంది శివ కోటేశ్వరరావు, రాఘవ అకౌంటెంట్ లక్ష్మి విఓఎలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

సర్వాంగ సుందరంగా సూర్యలంక బీచ్

కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : సూర్యలంక బీచ్‌ని సర్వాంగ సుందరంగా, పచ్చదనంతో, ఆహ్లాదకరంగా అభివృద్ధి చేసేందుకు అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి అన్నారు.బాపట్ల,సూర్యలంక బీచ్‌లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కలెక్టర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యలంక బీచ్‌కి రాష్ట్రంలో ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉన్నదన్నారు. ఆహ్లాదకర వాతావరణాన్ని ఆస్వాదించడానికి, సముద్ర స్థానాలకు అధిక సంఖ్యలో పర్యాటకులు వస్తుంటారన్నారు. బీచ్‌ని అభివృద్ధిపరిస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉందన్నారు.బీచ్‌ని పచ్చదనంతో, సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. బీచ్‌లో ఏకరానికి 160 మొక్కలు చొప్పున 7 ఎకరాల్లో 1120 కొబ్బరి మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. మొక్కలు నాటడానికి రూ.10 లక్షల నిధులు ఖర్చు చేస్తున్నామన్నారు. అంత మాత్రమే కాకుండా మొక్కలను పరిరక్షించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి పి.గ్లోరియా, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా అటవీ శాఖ అధికారి భీమయ్య మరియు పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి పటిష్ట బందోబస్తు

- ఎస్పీ తుషార్‌డూడి

విశాలాంధ్ర - బాపట్ల : ముక్కోటి ఏకాదశి పండుగ పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా దేవాలయాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తీసుకోవలసిన ముందస్తు భద్రత చర్యల గురించి ఎస్పీ గురువారం స్థానిక పోలీస్ ప్రధాన కార్యాలయం నుండి పోలీస్ అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ముక్కోటి ఏకాదశి పండుగ పురస్కరించుకొని ఆలయాలకు భక్తులు భారీగా తరలి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శుక్రవారం వేకువజాము నుండే దేవాలయాల వద్ద, పరిసర ప్రాంతాల్లో పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులు తాకిడి అధికంగా ఉన్న దేవాలయాల వద్ద బ్యారికేడింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దొంగతనాలు, చైన్ స్నాచింగ్‌లు జరగకుండా నిఘా ఉంచాలని సూచించారు. దేవాదాయ శాఖ అధికారులు, దేవాలయ కమిటీ సభ్యులతో సమన్వయంతో వ్యవహరిస్తూ భక్తులకు కావలసిన సౌకర్యాలను కల్పించాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు.

ఉచిత ఆరోగ్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర - చీరాల : బిపి,షుగర్‌లు ఉన్నవాళ్ళు ఆదివారం నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సిటిజన్స్ ముఖ్య కార్యదర్శి అత్తలూరి రామారావు అన్నారు.సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అత్తలూరి రామారావు మాటాడుతూ ఆదివారం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశామని చీరాల పరిసర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ పి.శ్రీనివాస్,డాక్టర్ మంజువాణి పాల్గొని బిపి,షుగర్,ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఈ అవకాశాన్ని అందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వవద్దు:ఎస్సై చంద్రశేఖర్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రానున్న సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని ఈపురుపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న అన్ని లాడ్జీలు,రిసార్టుల యాజమాన్యానికి,వాటిలో పనిచేసే సిబ్బందికి ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండా జాగ్రత్త వహించాలని ఎస్సై ఎ.చంద్రశేఖర్ సిబ్బందితో కలిసి నోటీసులు అందించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పేకాట, అక్రమ మద్యం నిల్వ ఉంచడం,అమ్మడం, మద్యం తాగుడుకు అనుమతించడం వంటివి జరుగకుండా చూడాలని కౌన్సిలింగ్ ఇచ్చారు.

చిన్నారికి ఎమ్మెల్యే వేగేశన ఆశీస్సులు

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని కంకటపాలెం గ్రామంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్,సీనియర్ టీడీపీ నాయకులు రావిపూడి నాగమల్లేశ్వరరావు మనవడు యువన్ రెండవ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్,మాజీ ఎమ్మెల్యే మంతెన అనంత వర్మ,బాపట్ల మండలం తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు,టీడీపీ నాయకులు మానవ విజేత,తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

పూరి గుడిసె దగ్ధం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండలంలోని కె అగ్రహారం గ్రామంలోని ఎస్టీ కాలనీలోని సవరం పోలయ్యకు చెందిన పూరిగుడిసె గురువారం పూర్తిగా దగ్ధమయింది. పోలయ్య భార్య ఎస్తేరమ్మ ఇంట్లో వంట చేస్తుండగా ఇంటి బయట చిన్న పిల్లలు ఏడుస్తుండగా ఇంట్లో నుంచి బయటకు వచ్చి చిన్న పిల్లలను ఓదార్చే లోపు ఇంట్లో ఉన్న పొయ్యిలోని పొయ్యి రవ్వలు పైకప్పుకు అంటుకొని ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఆర్థిక సాయం అందించాలని సీపీఐ మండల కార్యదర్శి ఎస్‌కెవై పెద్ద మస్తాన్ అన్నారు.